## క్లుప్తంగా

### స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యం



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి స్క్రీనింగ్ చేస్తారని, తీవ్రమైన కేసులను పీహెచ్‌సీలకు తరలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం అర్బన్: జూహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ సేవలు అమూల్యమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయంలో జూహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ సహకారంతో లయన్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఊర్లాన గోపాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ తరఫున రైతులకు సాయం, పిల్లలకు పుస్తకాలు, రోగులకు మందులు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జేసీస్ సెనేటర్ డాక్టర్ కూర్మాన వినోద్‌కుమార్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, సభ్యుడు గన్నెప్పడు, ట్రస్ట్ సభ్యులు కృష్ణారావు, శేఖర్, ప్రవీణ్, బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, సుప్రజ రౌత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


### సంకీర్తనలతో ముక్తి



ప్రవచనం చెబుతున్న కొండవీటి జ్యోతిర్మయి

గార: సంకీర్తనతో పరమపద సోపానం వస్తుందని ఆధ్యాత్మికవేత్త, తిరుమల తిరుపతి దేవస్థానాల గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. సోమవారం జొన్నలపాడు జంక్షన్ సమీపంలోని బృందావనంలో ప్రవచన, సంకీర్తన గానాలపించారు. నామజపంతో ఈతిబాధలు తొలగుతాయన్నారు. కృతయుగంలో ప్రహ్లాదుడు, త్రేతాయుగంలో హనుమంతుడు, ద్వాపర యుగంలో గోపికలు సంకీర్తనలు ఆలపించారన్నారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి పీఠం శ్రీలక్ష్మీ గణపతిశర్మ, బాల త్రిపురసుందరి పీఠం గణేష్ గురూజీ, యోగాచార్య ఎన్.వి.రామారావు, సంయుక్త, శ్రీను గురుస్వామి, శ్రీవారిసేవ సభ్యులు, నిర్వాహకులు చౌదరి దుర్గారావు పాల్గొన్నారు.

### దీపాల స్టాండ్ వితరణ



స్టాండ్‌పై దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీలోని రామమందిరంలో దీపాలు వెలిగించేందుకు రూ.8 వేలు విలువైన స్టాండ్‌ను గ్రామానికి చెందిన పోలాకి సాయి, గురజాల శ్యామసుందర్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

మధురవాడ: రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశానికి చెందిన మైలపల్లి రాముడు (34) తన భార్య కొర్లమ్మ, తోటి కార్మికులతో కలిసి విశాఖ జిల్లా బక్కన్నపాలెంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా 8వ ఫ్లోర్ నుంచి జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య కొర్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

### ధ్యానంతో ప్రశాంతత

శ్రీకాకుళం కల్చరల్: సామూహిక ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్ మాస్టర్లు అన్నారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని వికాస్ హైస్కూల్లో సోమవారం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ వ్యవస్థాపకులు సుభాష్ పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ధ్యానం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు వేణుగోపాల్, పీఎస్‌ఎస్‌ఎం సభ్యులు కోపూరి బింధుమాధవి, ఆలీ, సుజిత పాల్గొన్నారు.

# కాలనీల్లో కాలు పెట్టలేం!



శివరామ్‌నగర్‌కాలనీలో ఇళ్ల ముందే నిలిచిన మురుగునీరు

- మురుగునీటితో నిండిన శివరామ్‌నగర్ తదితర కాలనీల రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న స్థానికులు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల రోడ్లు స్థానికులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వాడుక నీరంతా ఇళ్ల ముందే నిలిచిపోవడంతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చిన్నబొందిలీపురం సత్యసాయిబాబా గుడి దగ్గర శివరామ్‌నగర్ కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇక్కడి రోడ్డుపై నెలల తరబడి మురుగునీరు నిలిచిపోయి చిన్నపాటి సాగునీటి కాలువలా దర్శనమిస్తోంది. దీంతో ఈ ప్రాంతమంతా దోమలు, పందులకు నిలయాలుగా మారాయి. తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు భరించలేకపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు మురుగులోపడి గాయాల పాలవుతున్నారు. తరచూ మురుగునీటిలోంచి రాకపోకలు సాగించడం వల్ల చర్మవ్యాధుల బారిన పడుతున్నారు.

**కానరాని కాలువలు..**

నగరంలో శివరామ్‌నగర్‌కాలనీ, డీసీసీబీ కాలనీ, ప్రకాష్‌నగర్‌కాలనీ, వరంకాలనీ శివారు లైన్లు, గోవింద్‌నగర్, విశాఖ-ఏ,బీ తదితర కాలనీల్లో కాలువలు, రోడ్లు సరిగ్గా నిర్మించలేదు. దీంతో మురుగునీరంతా రోడ్లపైకి వచ్చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హడావిడిగా కాలువల్లో మురుగు తీసి మమా అనిపించి మిగిలిన సమస్యలన్నీ గాలికొదిలేశారని నగరవాసులు మండిపడుతున్నారు. కాలువల్లో పూడికలు తీశాక సమస్య మరింత జటిలమైందని, పలకలు అస్తవ్యస్తంగా పడేయడం, కాలువల్లోనే పాత పలకలు పడిపోవడంతో మురుగునీరు ముందుకెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో చూపడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



మురుగుమయమైన రోడ్డు

**రోడ్డుపైనే మురుగునీరు..**



మా కాలనీరోడ్లు చెరువును తలపిస్తున్నాయి. కొన్నాళ్లుగా మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో దోమలు, పందులకు నిలయాలుగా మారాయి. ఈ విషయాన్ని నగరపాలక అధికారులకు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోలేదు. పన్నులు చెల్లించడమే తప్ప అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించడం లేదు.

– బి.రమణయ్య, శివరామ్‌నగర్‌కాలనీ, శ్రీకాకుళం

**చర్యలు చేపడతాం..**



రోడ్డుపైకి మురుగునీరు చేరిన విషయం మా దృష్టికి రాలేదు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. కాలువలు, రోడ్డు నిర్మాణం చేపట్టి మురుగునీరు రోడ్డుపై నిల్వ లేకుండా చర్యలు చేపడతాం.

– పి.వి.వి.డి ప్రసాద్, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్

## కంచె ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై ధ్వంసమైన కంచెను సోమవారం పునరుద్ధరించారు. ఇక్కడి కంచె దెబ్బ తిన్న విషయమై 'కథ కంచెకు' అనే శీర్షికన ఇటీవలో సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై జాతీయ రహదారుల సంస్థ స్పందించి కంచెను ఏర్పాటు చేసింది.



కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## నిబంధనలు పాటించాల్సిందే

ఎచ్చెర్ల క్యాంపస్: ఉచిత ఇసుక పాలసీ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని ఎచ్చెర్ల మండల రెవెన్యూ పరిశీలకుడు శ్రీనివాసరావు హెచ్చరించారు. 'చెప్పేది ఉచితం ..చేసేది వ్యాపారం!' అన్న శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పదించారు. తమ్మినాయుడుపేట, పాత పొన్నాడ, తెప్పరేవు, ముద్దాడపేట ఇసుక రీచ్‌లను పరిశీలించారు. నిత్యావసరాలకు కాకుండా ట్రాక్టర్లతో ఇసుక తరలింపు, ఇతర ప్రాంతాలకు విక్రయం వంటివి జరగకుండా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారులు నిరంతరం పరిశీలించి తహశీల్దార్‌కు నివేదిక అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.



తమ్మినాయుడుపేట రీచ్‌లో ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

## వాలీబాల్ పోటీల విజేత శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మూడు రోజుల పాటు సాగిన 68వ అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బాలురు విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది.

ఫైనల్లో విశాఖపట్నంపై విజయం సాధించింది. అనంతరం ఎంపిక చేసిన రాష్ట్రస్థాయి బాలురు జట్టులో జిల్లాకు చెందిన కె.వినయ్‌కుమార్, బి.కృష్ణ, కె.యువరాజశేఖర్‌లకు చోటు దక్కింది. బాలికల జట్టుకు పి.మానస (శ్రీకాకుళం) ఎంపికైంది.



విజేతగా నిలిచిన శ్రీకాకుళం బాలురు జట్టుతో నిర్వాహకులు

## నరసమ్మ నేత్రాలు సజీవం

శ్రీకాకుళమ కల్చరల్: వీరఘట్టం మండలం హుస్సేన్‌పురంలో నివాసముంటున్న కండాపు నరసమ్మ(65) మృతి చెందడంతో ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం తెలిపారు.

ఎవరైనా నేత్రదానం చేయాలనుకుంటే 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

### మరమ్మతులు షురూ..



జాతీయ రహదారిపై కొత్తబ్రిడ్జి రోడ్డు నుంచి బైరి రోడ్డు వరకూ వంతెనపై ఏర్పడిన గుంతలు, పలకల పగుళ్లకు మరమ్మతులు చేస్తున్నారు. హైవే సిబ్బంది వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేస్తున్నారు. క్రేన్ సహాయంతో పనులు సాగిస్తున్నారు. - శ్రీకాకుళం రూరల్

### చకచకా ఏఎఫ్‌టీ కేంద్రం పనులు



శ్రీకాకుళం నగర పరిధిలోని ముచ్చవానిపేట, బైరివానిపేట సరిహద్దులో నాగావళి నది పక్కన వివిధ రకాల వాహనాలకు (ట్రాన్స్‌పోర్టు, నాన్‌ట్రాన్స్‌పోర్టు) సంబంధించి ఆటోమేటెడ్ ఫిట్నెస్ టెస్టింగ్(ఏఎఫ్‌టీ) కేంద్రం మరో రెండు నెలల్లో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం నిర్మాణ దశలో పనులు జోరుగా సాగుతున్నాయి. రవాణా శాఖ ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి ఇక్కడ వాహనాలను తనిఖీ చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు.

- శ్రీకాకుళం రూరల్

### అల్లుకున్న పిచ్చిమొక్కలు



గార సమీపంలోని జల్లువలస జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకుంటున్నాయి. సీఎస్పీ రోడ్డు పక్కన 12 కేవీ విద్యుత్ లైను నుంచి జల్లువలస గ్రామానికి వెళ్లే త్రీఫేజ్ లైనుకు ఇవి అల్లుకోవడంతో ఎప్పు డు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటు దోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలును తొలగించాలని కోరుతున్నారు.

- గార

### యువ ఉత్సవ్‌కు సర్వం సిద్ధం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న యువ ఉత్సవ్‌కు సర్వం సిద్ధమైనట్లు వీసీ కె.ఆర్.రజిని తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. నెహ్రూ యువ కేంద్రంతో కలిసి జరిగే ఈ వేడుకల్లో ఏడు కేటగిరీల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

## ఆర్ట్స్ కళాశాల దయనీయ స్థితిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల) మైదానం పరిసరాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ కోరారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ఎస్పీ గ్రీవెన్స్‌లో అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. రక్షణగోడను ఎన్నిసార్లు బాగు చేస్తున్నా బయట వ్యక్తులు పగలగొడుతున్నారని, రాత్రిపూట గేట్లు మూసివేసినా దూకేసి వచ్చి అసాంఘిక పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల గ్రౌండ్‌లో రెండు అక్రమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంపై గతంలో ఎఫ్ఐఆర్ నమోదైనా ఇప్పటికీ చర్యలు లేవన్నారు. అనిల్ అకాడమీ టెన్నిస్ కోచింగ్ సెంటర్ లీజు గడువు ముగిసినా ఖాళీ చేయడం లేదన్నారు. కొన్ని గ్రూపులవాళ్లు గ్రౌండ్‌లో అనుమతులు లేకుండా అనధికారికంగా షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు నిర్మించాయని, దీనిపై ప్రశ్నిస్తే పబ్లిక్ ప్రాపర్టీ అంటూ దబాయిస్తున్నారని పేర్కొన్నారు.అనంతరం ఏఎస్పీ స్పందిస్తూ ఈ విషయం ఇప్పటికే ఎస్పీ, కలెక్టర్ దృష్టిలో ఉందన్నారు. క్యాంపస్ చుట్టూ లైటింగ్, సీసీ కెమెరాలు పెట్టే యోచనలో ఉన్నారని తెలిపారు. అసాంఘిక పనులు చేపట్టే వారిపై ఇప్పటికే పోలీసుల బృందం నిఘా పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆర్.హరిత, జువాలజీ లెక్చరర్ ఎస్.రవిబాబు, సూపరింటెండెంట్ యు.పి.రాజు, విద్యార్థుల యూనియన్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సిద్దార్థ్, కల్చరల్ సెక్రటరీ యశ్వంత్ పాల్గొన్నారు.



అడిషనల్ ఎస్పీకి సమస్య వివరిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

## హరహర మహాదేవ

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, నిర్వాహకులు సౌకర్యాలు కల్పించారు. - సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: ఉమామహేశ్వరుడు



శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి శివాలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రణస్థలం: జె.ఆర్.పురంలో శివాలయంలో..



ఎచ్చెర్ల: శివాలయంలో పూజలు



శ్రీకాకుళం కల్చరల్:చందనం అలంకరణలో భీమేశ్వరుడు



గార: శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయంలో..



శ్రీకాకుళం: నాగావళి నదిలో తెప్పలు వదులుతున్న భక్తులు

### ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో రోడ్ సెంటర్లు, ప్రధాన కూడళ్లలో ఎటువంటి ప్రకటనలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టరాదని కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఫ్లెక్సీలు కడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### భూతగాదాలో ఇద్దరికి గాయాలు

జి.సిగడాం: పంట పొలం విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రం జి.సిగడాంకు చెందిన నాయిన సూర్యనారాయణ , వెంకటరావులు అదే గ్రామానికి చెందిన నాయిన లక్ష్మణ, సీతం నాయుడు, నాయిన శంకర్, గోపి, శివన్న, రాజు మధ్య సోమవారం భూతగాదా జరిగింది. మాటామాటా పెరగడంతో నాయిన లక్ష్మణ, మరో ఐదుగురు కలిసి నాయిన సూర్యనారాయణ, వెంకటరావులపై కర్రలతో దాడి చేశారు. గాయాల పాలైన ఇద్దరిని 108 అంబులెన్సులో రాజాం ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### స్టాంప్‌డ్యూటీ బిల్లులు చెల్లించాలని వినతి

ఎచ్చెర్ల: లావేరు మండల సర్పంచ్‌లకు స్టాంప్‌డ్యూటీ బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే రణస్థలం రిజిస్ట్రార్‌కు తెలియజేసినా కారణాలు చెబుతున్నారు తప్ప బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చాంద్ బాషా, నాయకులు దాశెట్టి తిరుపతిరావు, పెయ్యిల లక్ష్మణరావు, గొర్లె ప్రభాకర్‌నాయుడు, ఎల్లంనాయుడు, ఆదినారాయణ, దుర్గాశి ధర్మారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌గేమ్స్‌లో సిక్కోలు జైత్రయాత్ర



అండర్-17లో రన్నరప్ ట్రోఫీతో క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు



అండర్-19 చాంపియన్ ట్రోఫీతో జిల్లా బాలికల జట్టు, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) అండర్-19 హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచి ట్రోఫీని, బంగారు పతకాలను కై వశం చేసుకుంది. జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లగా వ్యవహరించిన ఆర్.సతీష్‌రాయుడు, ఎల్.డిల్లేశ్వరరావు క్రీడాకారులను మెప్పించి జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. అదే విధంగా, ఈనెల 9 నుంచి 11 వరకు కృష్ణా జిల్లా పటమట జెడ్పీహెచ్ స్కూల్ వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) అండర్-17 హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాలు సాధించారు. ఈ జట్టుకు గురుగుబెల్లి రాజశేఖర్ (పీడీ- జెడ్పీహెచ్‌స్కూల్ పిల్లలవలస), డి.ఈశ్వరరావు (పీడీ- జెడ్పీహెచ్‌స్కూల్ అల్లినగరం)లు కోచ్ మేనేజర్లగా వ్యవహరించారు.

### ఆజాద్‌కు ఘన నివాళులు



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



శ్రీకాకుళం అర్బన్ స్మృతివనంలో ఆజాద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా రంగానికి అందించిన సేవలు ఎంతో విలువైనవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ విద్యా దినోత్సవం , అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మైనారిటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో మహిబుల్లాఖాన్ సౌజన్యంతో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సురంగి మోహన్‌రావు, మేడూరి ప్రసాదరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షిప్తంగా..

**విద్యార్థులకు గాయాలు**

ఎచ్చెర్ల : తామాడ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సోమవారం తరగతులు ముగిశాక ఆటోలో ఇళ్లకు వెళ్తుండగా భీమునిపాలెం వద్ద వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో వుంగరాడ మహేష్, శ్రావిణి, సావిత్రిలకు గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. లావేరు ఎస్సై లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**స్కూల్‌గేమ్స్ పోటీల్లో విద్యార్థికి స్వర్ణం**

శ్రీకాకుళం న్యూకాలనీ: అన్నమయ్య జిల్లాలో జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ పోటీల్లో బలగ శ్రీచైతన్య స్కూల్లో చదువుతున్న 8వ తరగతి చదువుతున్న డి.రాహుల్ బంగారు పతకం సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ఏజీఎం ఎం.వీ.సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ శీపాన రామినాయుడు, బాలరాజు, మీసాల జగదీష్, రామ్మోహన్, మల్లేశ్వరరావు, ఉషారాణి, శ్రీనివాసరావు సోమవారం అభినందించారు.

**విద్యావ్యవస్థ గొప్పది**

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతదేశ విద్యావ్యవస్థ చాలా గొప్పదని కాకినాడ ఆదిత్య విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి అన్నారు. సోమవారం కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శివశంకర్, కె.వేణు, ఎల్.మోహన్, పైడిరాజు పాల్గొన్నారు.